# ఆకాశమంత

"మిసెస్ కుమార్!"

చివ్వున తలయెత్తి చూశాను. సునీత . . . మిసెస్ సునీతారావ్.

"ఈ మధ్య నల్లపూసై పోయారు. బిజీనా"

"నల్లపూసై పోలేదు. నల్లపూసలు పోయాయి ఈ మధ్యనే" అందామనుకున్నా- అనవసరమనిపించింది.

నవ్వుని అతికించుకుని "అవునండీ" అన్నాను.

"ఎలా నడుస్తోంది మీ కుమార్ గార్మెంట్స్" ఎర్రెర్రని టమేటాలు ఏరుకుంటూ నావైపు చూడకుండానే అడిగింది.

నేను కూడా నాక్కావల్సిన కూరగాయలు ఏరి బుట్టలో వేస్తూ ఆమెవైపు చూడకుండా అంతే యధాలాపంగా చెప్పాను. "బాగానే ఉంది".

ఆమె ఏం అడగాలని తాపత్రయపడ్తోందో నాకు తెల్సు. సూటిగా అడిగేస్తే నేనేమను కుంటానోనని . . . ఇంటర్వ్యూ ప్రారంభించేముందు అభ్యర్థిని సమాయత్త పరిచినట్లు . . . హిపోక్రసీ పెదవుల మీంచి కారిపోతూ -

"మిస్టర్ కుమార్ మరో పెళ్ళి చేసుకున్నారటగా" ఆమె గొంతులో కుతూహలంతోపాటు, కిందపడిన వ్యక్తిని చూసి రాక్షసంగా నవ్వుకునే హాలాహలం.

ఎదుటి వ్యక్తి జీవితం కాలిబూడిదైపోతుంటే చూడటం ఎంత సరాదానో వీళ్ళందరికీ . . .

కూరగాయలన్నీ సంచీలోకి ఒంపుకుని, వస్తూ వస్తూ చెప్పాను.

"అవునండీ, పెళ్ళికి నేను కూడా వెళ్లాను నాలుగక్షింతలు చల్లిరావడానికి".

"ఆ!" అంటూ నోరు తెరిచింది సునీత.

అక్కసుకొద్దీ అలా సమాధానమిచ్చినా మనసులో ఏదో తెలీని అలజడి . . .

పెళ్ళయినప్పటి నుండీ మా యింటికి ఫర్లాంగు దూరంలో ఉన్న కూరగాయల మార్కెట్‌కి వెళ్ళి కావల్సిన కూరగాయల్ని కొనటం నాకలవాటు. అవి శుభ్రంగా, తాజాగా, నవనవలాడ్తూ ఉంటే తప్ప వాటితో వంట చేయాలనిపించదు.

'నాకు ఆడదీ అంతే. తాజాగా . . . నవనవలాడ్తూ ఉంటేనే . . .' అనేవాడు కుమార్.

అటువంటి కుమార్‌ని నేనెలా ప్రేమించానో ఎంతాలోచించినా అర్థమే కావటం లేదిప్పుడు. ప్రేమ గుడ్డిది కదా.

మొదటినుంచీ స్త్రీ స్వాతంత్ర్యం గురించి అనర్గళంగా మాట్లాడేదాన్ని. ఇంట్లో నాన్న కూడా నన్నూ, అక్కనీ అలానే పెంచారు.

'మగాడితో పోలిస్తే ఆడది తక్కువ అనేది నిజం కాకున్నా, సమాజంలోని ఓ వర్గం పని గట్టుకుని, వాళ్ళ స్వలాభం కోసం దాన్ని నిజమని నమ్మించడానికి ప్రయత్నిస్తున్నారు. మీరు నమ్మకండి. వాళ్ళ మాయాజాలంలో పడకండి. ఏ విషయంలోనైనా మగవాడు మీకన్నా అధికుడేమోననే అనుమానాన్ని కూడా దరిచేరనీయకండి' అనేవాడు నాన్న.

తను అనటమే కాదు, ఆచరించి చూపేవాడు. అమ్మను తన భార్యగా, స్నేహితురాలిగానే కాకుండా ఒక్కోసారి అధికురాలనే ఆమోదించి గౌరవించేవాడు.

అమ్మానాన్నల అన్యోన్యత చూసి – దాంపత్య జీవితం ఎంత మధురమైనదో అనుకునేదాన్ని. వాళ్ళు నాకు ఆదర్శం. ఎపుడెపుడు నా జీవితంలో కూడా అంతటి మాధుర్యం చోటు చేసుకుంటుందా అని వువ్విళ్ళూరేదాన్ని. చదువుమీద శ్రద్ధ తగ్గి పెళ్ళిమీద మనసు మళ్ళటానికి కారణం మా అమ్మానాన్నల అనురాగం.

డిగ్రీ సగంలో ఉన్నప్పుడే కుమార్ పరిచయమైనాడు. బ్యాంక్‌లో ఆఫీసర్. స్ఫురద్రూపి, చిలిపిచూపులు, అల్లరి మాటలు . . . మరో ఆలోచన లేకుండా – ఈత వస్తుందో రాదో తెలీకుండానే ప్రేమాంబుధిలోకి దూకేశాను.

కుమార్ . . . ఆ పేరు తల్చుకుంటేనే నరాల్లోకి అమృతం ప్రవహిస్తున్నట్లు . . .

శరీరం మొత్తం వీణ తంత్రిలా మారి వీనుల విందుగా మోగుతున్నట్లు . . .

నాకెంత ఇష్టమైన పేరు!

'తారకమంత్రంలా జపిస్తున్నావేంటే' అనేది అక్క ముద్దుగా విసుక్కుంటూ . . .

'ఇంతకీ రాముడా, కొంటె కృష్ణుడా నీ ప్రియుడు' అని అడిగితే గర్వంగా 'నా ఎదురుగా ఉన్నంతసేపూ చిలిపి కృష్ణుడే, బైటికెళ్తే మాత్రం రామభద్రుడే' అంటూ మురిసిపోతూ చెప్పాను.

అలాంటి కుమార్ . . . నేను అమితంగా ప్రేమించి, తను కూడా నన్నంతగా ప్రేమిస్తున్నట్లు భ్రమలో ముంచేయగలిగిన కుమార్ . . .

ఆలోచనల్లోనే ఇల్లొచ్చింది. కారు పక్కనే నిలబడి ఉన్న డ్రైవర్ వచ్చి చేతిలోని సంచి అందుకున్నాడు.

ఇంతదూరం మోసిన దాన్ని ఇంట్లోపలికి మోయలేనా? ఏమిటో అర్థంలేని భేషజాలు.

నాకు మొదట్నుంచీ స్వయంకృషి మీదే నమ్మకం. అందుకే చదువు సగంలో ఆగిపోయినా ప్రైవేట్‌గా చదివి డిగ్రీ సంపాయించుకున్నాను.

ఫోన్ మోగుతోంది. వెళ్ళి రిసీవర్ అందుకున్నాను.

"హలో మిసెస్ కుమార్ . . ." అంటూ మాటలు. నాకంటూ ఓ పేరుందిగా – మాలతి అని. అలా పిలవ్వొచ్చుగా . . .

'ఎంత చక్కటి పేరు! నువ్వు నిజంగా మాలతీ లతలా ఉన్నావు' అనేవాడు కుమార్. అదుగో మరలా కుమార్ ఆలోచనలు . . .

కుమార్ తనకు సంబంధించిన వస్తువులన్నీ తీసుకుపోయాడు. కానీ జ్ఞాపకాలు . . . వాటిని మాత్రం నాకు వదిలేసి వెళ్లాడు.

'వారం లోపల మన పెళ్ళి జరిగిపోవాలి' అని తొందర పెడితే – 'నా నుంచి దూరంగా ఉండలేక' అని ఎంత భ్రమ పడ్డాను!

"ఉంటాను మిసెస్ కుమార్"

ఫోన్ విసురుగా పెట్టేశాను.

'నువ్వు నా గుండెల్లోనే ఉంటావు. నీ కోసం అక్కడో గుడి కట్టాను' అన్నాడు కుమార్.

ఇప్పుడో . . . నా గుడిని పగులకొట్టి మరొక అమ్మాయి కోసం కొత్తగా గుడికట్టి

ఉంటాడు. మంత్రగాడు కదా . . . పగుల కొట్టక్కరలేదు. కళ్ళనూ, చేతుల్నీ మూడుమార్లు తిప్పి హాంఫట్ అంటే చాలు. గుడి మాయం . . .

'నిన్నంతగా మంత్రముగ్ధురాల్ని చేసిన ఆ కుర్రాడెవరో ఓసారి పిల్చుకురా . . . మాట్లాడతాను' అన్నాడు నాన్న.

కుమార్ వెళ్ళిపోయినా నేనింకా అతని ప్రభావంలోంచి బైటపడలేకపోతున్నాను. సాలెగూడులా అల్లుకుంటూ ఆలోచనలు . . . అతని చుట్టూతా . . . అతనితో ముడిపడి . . .

అతనేసిన మూడు ముళ్ళు ఎప్పుడో విప్పదీసేసి బీరువాలో ఖననం చేశాను. హారర్ సినిమాలో పేటికలోంచి శవాలు లేచొచ్చినట్లు జీవం పోసుకుని ఎదురుగా నిలబడ్తున్న వేనవేల ఆలోచనలు . . .

విడాకులు తీసుకున్నప్పటి నుండీ నన్నెవరైనా మిసెస్ కుమార్ అని పిలిస్తే కోపం వస్తోంది. నేను మూణ్ణెల్లనుంచీ మిసెస్ కుమార్‌ని కాదు, కేవలం మాలతిని మాత్రమే అని అరిచి చెప్పాలనిపిస్తోంది.

జడ్జిగారు విడాకులైతే మంజూరు చేశారు గానీ, మరెవ్వరూ నన్ను మిసెస్ కుమార్ అని పిలవకూడదని – అది శిక్షార్హమైన నేరమని ఆర్డర్ వేసి ఉంటే బావుండేది. మనిషే వదిలేశాక నన్నింకా తోకలా అంటిపెట్టుకున్న అతని పేరుని ఏ సర్జనో కత్తిరిస్తే బావుంటుంది.

రోజులానే తయారయి కారులో మా షాపుకు బయల్దేరాను. నాకు ముగ్గురు కొడుకలనిపిస్తుంటుంది దీన్ని చూసినప్పుడల్లా . . .

'మనకెందుకు బిజినెస్' అని కుమార్ అభ్యంతరపెట్టినపుడు నేను లొంగిపోయి ఉంటే ఈ పాటికి నా స్థితి ఎలా ఉండేదో? తల్చుకుంటేనే వళ్ళు జలదరిస్తోంది.

'నేను ఉద్యోగం చేస్తున్నాను కదా. నువ్వెందుకు నీ నాజూకైన శరీరాన్ని హింస పెట్టాలనుకుంటావు? నేనాఫీసునించి వచ్చేప్పటికి అందంగా ముస్తాబై, అప్సరసలా కన్పిస్తే చాలు. నీ శ్రమా, నా శ్రమా కలిపి నేనే పడ్తాను. ఆడది చేయాల్సిన పనుల్లో అతి ముఖ్యమైనవేంటో తెలుసా? భోజ్యేషు మాతా, శయనేషు రంభ' అంటూ నవ్వాడు కుమార్.

పట్టుబట్టి మొదట చిన్న బొటిక్ పెట్టాను. దాన్ని నా స్వయం కృషితో, అంకితభావంతో పెంచి, పెద్ద చేశాను. ఇపుడు కుమార్ గార్మెంట్స్‌కి మార్కెట్లో ఓ గుర్తింపు ఉంది. మొదట

ట్రేడింగ్‌కే పరిమితమైన నేను తర్వాత మాన్యుఫ్యాక్చరింగ్ ప్రారంభించాను.

వందమందికి పైగా పని వాళ్ళున్నారు. రకరకాల డిజైన్లలో డ్రస్సులు కుట్టి ఈ సిటీలోనే కాకుండా, వేరే చోట్లకి ఎక్స్‌పోర్ట్ కూడా జరుగుతోంది. ఇది నా బేబీ - పదేళ్ళుగా పోషించింది నేను. అందుకే నా యిద్దరు పిల్లల్తో దీన్ని కూడా కలిపి నాకు ముగ్గురు పిల్లలనుకుంటాను.

కౌంటర్‌లో ఉన్న మేనేజర్ శ్రీనివాసరావు గారు లేచి విష్ చేశారు. నాకు తండ్రి తర్వాత తండ్రి అంతటివారు. నేను పదేళ్ళ క్రితం లక్ష రూపాయల పెట్టుబడితో వ్యాపారం పెట్టినప్పటి నుండీ నాకు అండగా ఉన్న వ్యక్తి.

'మీరు వయసులో పెద్దవారు. ఈ సంస్థ ఇంతగా ఎదగడానికి దోహదపడినవారు. నన్నలా మన్నించకండి' అని ఎన్నిసార్లు చెప్పినా వినరు.

'మీరు మాకు యజమాని. నేను వర్కర్లందరికీ ఆదర్శంగా ఉండాలమ్మా. స్వయం శక్తితో ఓ స్త్రీ ఎంతటి ఎత్తుకి ఎదగగలదో నిరూపించిన మీరు ఎంతటి గౌరవానికి అర్హులో వాళ్ళకు నేను ఈ విధంగా గుర్తు చేస్తుంటాను' అంటారు.

"మీతో మాట్లాడాలి రండి" అని నా ఆఫీసు గదిలోకి వెళ్ళాను.

శ్రీనివాసరావుగారు వచ్చి నా ఎదురుగా కూచున్నారు.

"కుమార్ గార్మెంట్స్ అనే పేరు మార్చేయాలనుకుంటున్నాను. నా పేరుతో మాలతీ గార్మెంట్స్ అనో లేక అబ్బాయి పేరుతో మనోజ్ గార్మెంట్స్ అనో మార్పించి రిజిస్టర్ చేయించండి" అన్నాను.

శ్రీనివాసరావుగారు చిన్నగా నవ్వారు.

"మీరిలా ఏదో రోజున అంటారని నాకు తెల్సమ్మా. పేరులో ఏముంది? షేక్స్‌పియర్ అన్నట్లు . . . గులాబీకి ఏ పేరు పెట్టినా దాని అందంలోగాని, హుందాతనంలోగాని మార్పు రానట్లే ఈ బిజినెస్‌కి ఏ పేరు పెట్టినా అది మీదే . . . మీ స్వంతం . . . మీ శ్రమఫలం . . ."

"నా జీవితంలోంచే వెళ్ళిపోయిన వ్యక్తిని పదేపదే గుర్తు చేసేదేదీ నాకు వద్దు. వాటిని తక్షణం మార్చేయాలనుకుంటున్నాను. వ్యక్తిగత సంబంధాల్లోనే కాదు, వ్యాపారంలో కూడా నేనిచ్చిన మాటకు కట్టుబడిన దాన్ని. మాట నిలబెట్టుకోలేని వ్యక్తికి, మోసం చేసిన

వ్యక్తికి నా నిఘంటువులో స్థానం ఉండదన్న విషయం మీకు తెల్సుగా. అతని పేరే కాదు దానిలోని చిన్న అణువైనా సరే నాకు వద్దు”.

“మన బిజినెస్ సంస్థ పేరు మార్చినంత మాత్రాన మీ జ్ఞాపకాలు చెరిపేసుకోగలరా అమ్మా . . . ఇప్పటికే కుమార్ గార్మెంట్స్‌కి, కుమార్ హోసియరీకి మార్కెట్ సర్కిల్స్‌లో చాలా విలువుంది. మంచి పేరుంది. మనమీద ఆధారపడి దాదాపు వంద కుటుంబాలు బతుకుతున్నాయి. మనం పది సంవత్సరాలు శ్రమించి సంపాయించుకున్న గుడ్‌విల్ నష్టపోతాం. మనం పెట్టే కొత్త పేరు మనతో బిజినెస్ చేసే వందల సంస్థల్లోకి ఇంకే లోపల మన వ్యాపారానికి జరగవల్సిన నష్టం జరిగిపోతుంది. మీరాలోచించండి”.

“మీరు వయసులో, అనుభవంలో పెద్దవారు. మీ మాటమీద నాకు అపారమైన గౌరవం ఉంది. రేపు శనివారం. ఎల్లుండి ఎలాగూ శలవే. ఈ రెండ్రోజులూ ఆలోచించి ఓ నిర్ణయానికొస్తాను. మనం సోమవారం ఉదయం మరలా ఈ విషయం గురించి మాట్లాడుకుందాం” అన్నాను.

* * * * *

శనివారం ఉదయం . . . మనోజ్‌ని హైస్కూల్లో చేర్పించడానికి అప్లికేషన్ పూర్తి చేద్దామని కూచున్నాను. ఆదిలోనే హంసపాదులా మనోజ్ అని పేరు రాశాక రెండోకాలమ్ సన్ ఆఫ్ . . . దగ్గర ఆగిపోయాను. కుమార్ అని రాయాలా? మనోజ్ తండ్రి కుమారే. కానీ ప్రస్తుతం లేడుగా. ప్రోగ్రెస్ రిపోర్టులో సంతకాలు పెట్టటానికి, తండ్రిగా మిగతా బాధ్యతలు మోయడానికి అతను లేనపుడు ఆ పేరు ఎందుకు రాయాలి? మగవాడి పేరే రాయాలా? ఆడదానికి కూడా కొడుకేగా . . . అసలు సంతానం మీద అధికారం తల్లులకే ఉండాలి. పిల్లాడు కడుపులో పడ్డ క్షణం నుంచీ వాడిని నవమాసాలు మోసి, కనీ, పాలిచ్చి పెంచి, పెద్ద చేసేవరకు తల్లి పడే శ్రమలో మగవాడి వంతు ఒక శాతం కూడా ఉండనప్పుడు పిల్లలు మగవాడి సంతానంలానే చలామణి అవటం అన్యాయం కాదా ?

మరో ఆలోచన లేకుండా మనోజ్ – సన్ ఆఫ్ మాలతి అని రాసి అప్లికేషన్ పూర్తి చేశాను. స్కూలుకెళ్ళి అప్లికేషన్ ఇచ్చి ఫీజు కట్టేసి వచ్చాను.

కానీ కుమార్ గార్మెంట్స్ పేరు మార్చే విషయంలో అంత తొందరగా నిర్ణయానికి

రాలేకపోతున్నాను. శ్రీనివాసరావుగారు చెప్పినట్లు నా నిర్ణయం మీద వంద కుటుంబాల భవిష్యత్తు ఆధారపడి ఉంది.

ఆలోచనలతో మెదడు వేడెక్కిపోతోంది. నన్ను కాదనుకుని, చారులో కరివేపాకులా తీసి పడేసి, నా గుండెల్ని తొక్కుకుంటూ వెళ్ళిపోయిన వ్యక్తి పేరుతో బిజినెస్ నడపటం అవమానంగా ఉంది. నేనిన్నాళ్ళూ భద్రంగా కాపాడుకుంటూ వస్తున్న ఆత్మాభిమానంలో పగుళ్ళు ఏర్పడినట్లు . . . కానీ ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే ఇన్నాళ్ళూ సంపాయించుకున్న గుడ్‌విల్ నష్టపోవటం మంచిది కాదేమోననిపిస్తోంది.

ఆదివారం ఉదయం శోకాలు పెడ్తూ మా పనిమనిషి రావులమ్మ వచ్చింది. ఆమెతోపాటు మూణ్ణెల్ల క్రితం పెళ్ళయిన ఆమె కూతురు సీతాలు కూడా ఉంది. నల్లగా తారు పూసినట్లుండే సీతాలు మొహంలో ఘనీభవించిన విషాదంతో పాటు ఉక్కుముక్కలా విశ్వాసం కూడా కన్పిస్తోంది. పెళ్ళయ్యేవరకూ సీతాలు మా యింట్లో పని చేసింది. ఈ మూణ్ణెల్లనుంచే వాళ్ళమ్మ పనికి రావటం.

“నువ్వయినా సెప్పమ్మా దీనికి బుద్ధి. . . పెల్లయి మూన్నెల్లయినా కాలేదు. కాపురం సేయదట. ఆడ్ని వదిలేసిందట. పిల్ల అమావాసికంలా నల్లగుందని పెల్లెలా సేయాలా బగమంతుడా అనుకుంటుంటే నా తమ్ముడు మంసోడు కాబట్టి దీన్ని సేస్కున్నాడు. ఆడికి నేనేమని సమాదానం సెప్పను? పదిమందిలో మొగమెలా ఎత్తుకుని తిరగనూ?” మరలా వలవలా ఏడ్చింది రావులమ్మ.

“నువ్వు మొగం దింపేసుకునే పనేమీ నేను సేయలా. నాకా మొగుడు వద్దూ, పెల్లీ వద్దు. అంతే. నా బతుకేదో నేను బతుకుతాను” అంది స్థిరంగా సీతాలు.

నేను సీతాలుని పక్కకు పిల్చుకెళ్ళి “అసలు సమస్య ఏమిటో నాకు చెప్పు. ఎందుకతన్ని వదిలేయాలనుకుంటున్నావు? నిన్ను సరిగ్గా చూడటం లేదా . . . చేయి చేసుకుంటున్నాడా, నిన్ను ప్రేమగా చూడటంలేదా?” అని అడిగాను.

“మా అమ్మ మాట కాదనలేక నేను నల్లగా ఉన్నా సేసుకున్నాడట. నేను వంటసేస్తూ యింట్లో పడుంటే ఆడు మరోదాన్ని సేస్కుని వూరేగుతాడట. సినేమాలకూ సికార్లకూ నన్ను పిల్సుకెల్తే ఆడికి నామోసీ అట. ఆడికంటే ముందు నేనే ఆడ్ని వదిలేసినా” అంది సీతాలు. తను చేసిన పని సరియైనదేనన్న నమ్మకం ఆ అమ్మాయి కళ్ళలో దివ్యంగా వెలుగుతోంది.

ఆ మాటలు విన్నదేమో రావులమ్మ విసురుగా వచ్చింది – "ఆడు మగాడు. ఆడిస్టం. నిన్ను వదిలేస్తాననలేదే. అయినా నీ కంత పొగరు మంసిది కాదు. ఆడికేం సుకంగా బతికేస్తాడు. నీ బతుకే కుక్కలు సింపిన ఇస్తరవుద్ది".

"ఎందుకవుద్ది? మగాడి తోడు లేందే బతకలేనా . . . కాయకష్టాన్ని నమ్ముకున్నదాన్ని. నాలుగిల్లల్లో పాసి పని సేస్కుంటే సాలు గడిసిపోద్ది. ఆడింట్లో ఆడి కాలికింది సెప్పులా అబిమానెం సంపుకుని కాపురం సేయను – సావనైనా సస్తాను కాని".

"నువ్వాడదానివన్న ఇసయం మర్సిపోతున్నావే" అంది రావులమ్మ.

"ఆడదాన్నే. అబిమానెం సచ్చిపోని ఆడదాన్ని. నేనాడితో ఆడి బతుకులో బాగం పంచుకోవాలని ఎల్లాను. కాని ఆడెవత్తెనో మనువాడి కులుకుతుంటే సూస్తూ ఆడు పిల్సినపుడు పక్కలో తొంగొని, ఆడు ఇదిల్సే ఎంగిలిమెతుకులు తినడానికి ఎల్లలేదు. ఆడదాన్ని కాబట్టి బతుక్కు బయపడి ఆడికి లొంగాలా . . . నా బతుకెలా బతకాలో నాకు తెలుసు" అంది సీతాలు.

ఆమె నలుపులో నాకిపుడో అద్భుతమైన సౌందర్యం కన్పిస్తోంది. ఆ అమ్మాయిలో ధవళకాంతితో మెరుస్తోన్న స్వాభిమానానికి నాకు ముచ్చటేసింది.

"చాలా మంచి పని చేశావు సీతాలు. నీ ఆత్మస్థైర్యాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నా" అన్నాను మనస్ఫూర్తిగా.

"ఇయన్నీ మీ దగ్గరు నేర్సుకున్నయేనమ్మ" అంది సీతాలు.

"అదేంటమ్మా . . . సిన్నపిల్ల . . . దానికి బుద్ది సెప్పాల్సింది పోయి . . ." రావులమ్మ ఏదో అనబోయింది.

"బుద్ధి చెప్పాల్సింది నీకే. నీ తమ్ముడు మరోదాన్ని చేసుకుని నీ కూతుర్ని కించపరుస్తానంటే నువ్వెలా వూర్కున్నావు? పదిమందినీ పిల్చి పంచాయితీ పెట్టి వాడికి గడ్డి పెట్టొద్దూ. నీవు తల్లివి కదా. నీకూ నీ తమ్ముడికీ సీతాలు నలుపే కన్పించిందా – మల్లెపూవులా తెల్లగా ఉండే దాని మనసు తెల్సుకున్నారా ఎప్పుడైనా?" అంటూ చివాట్లు పెట్టాను.

వాళ్ళిద్దరూ వెళ్ళిపోయాక మరలా ఆలోచనలో పడ్డాను. సీతాలు స్వాభిమానంలో ఎదురయ్యే ఒడిదుడుకులు ఆమెకు మాత్రమే పరిమితం. మరి నా విషయంలో వంద

కుటుంబాల ప్రమేయం మిళితమై ఉంది.

అప్పటివరకూ అస్పష్టంగా అందకుండా తప్పించుకుంటున్న ఆలోచనలు ఇప్పుడు స్పష్టమైన రూపాన్ని సంతరించుకుంటున్నాయి.

సీతాలు వయసులో ఉండి, అక్షరజ్ఞానం లేని పనిపిల్లై ఉండి, తనను అగౌరవపరచిన భర్తను ఎడంకాలితో తన్ని, జీవితంతో ధైర్యంగా పోరాడటానికే నిర్ణయించుకుంది. నా బిజినెస్ ఇంతగా ఎదగటానికి కారణం నా స్వయం కృషి. కుమార్ గార్మెంట్స్ పేరు మార్చడం వల్ల వచ్చే కష్టనష్టాల్ని నేను తప్పకుండా తట్టుకోగలను. నా మీద ఆధారపడిన వంద కుటుంబాల్ని ఎలా ఆదుకోవాలో నాకు తెలుసు. ఆడవాళ్ళు ఆకాశంలో సగమే కాని, స్వాభిమానంలో సగం కాదు - సంపూర్ణం.

సోమవారం పదింటికి ఆఫీసులో అడుగు పెట్టూనే శ్రీనివాసరావుగార్ని పిలిచాను."మన బిజినెస్ పేరు వెంటనే మార్చేయండి. మాలతి గార్మెంట్స్ అని రిజిస్టర్ చేయించండి. మన కస్టమర్లందరికీ ఈ విషయం తెలియచేస్తూ ఉత్తరాలు పంపండి, ఈ రోజే . . . ఈ బోర్డు తీసేసి కొత్త బోర్డు రాయించండి" అన్నాను.

వారు నా వైపు దీర్ఘంగా చూసి, ఏదో చెప్పబోయి, విరమించుకుని "సరేనమ్మా" అన్నారు.

ఫోన్ మోగింది.

"హలో మిసెస్ కుమార్" అని విన్పించింది అవతలివైపు నుంచి.

"కాల్ మీ మాలతీ" అన్నాను. నా గొంతులో ఆకాశమంత విశాలంగా పర్చుకున్న ఆత్మ విశ్వాసం.

**(నవ్య వార పత్రిక - 7 జూలై, 2004)**